క్లుప్తంగా

నేడు ఎమ్మెల్యే పర్యటన

ఖానాపూర్: ఖానాపూర్, పెంబి మండలాల్లో మంగళవారం ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పర్యటించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలిపారు. పెంబి మండల కేంద్రంలో జెడ్పీ హెచ్ఎస్‌తో పాటు పీహెచ్‌సీని ప్రారంభించి సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తారన్నారు. అనంతరం ఖానాపూర్ మండలంలోని సత్తనపల్లితో పాటు ఖానాపూర్ మార్కెట్ యార్డులో పీఏసీఎస్ వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి, ఎంపీడీవో కార్యాలయంలో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేస్తారని తెలిపారు. కడెం మండలంలోని కొండుకూరు, పాండ్వాపూర్, లక్ష్మీపూర్ గ్రామాల్లో వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు.

వ్యాపారులు లైసెన్సు తీసుకోవాలి

ముధోల్: మండల కేంద్రంలోని వ్యాపారులు లైసెన్సులను తప్పనిసరిగా తీసుకోవాలని ఈవో ప్రసాద్ గౌడ్ అన్నారు. సోమవారం లైసెన్స్‌లపై వ్యాపారస్తులకు అవగాహన కల్పించారు. లైసెన్సు లేని వారు ఆన్‌లైన్ ద్వారా రుసుము చెల్లించి, లైసెన్సు తీసుకోవాలని, రెన్యూవల్ చేసుకోవాలని సూచించారు. గ్రామపంచాయతీ సిబ్బంది మాదవ్, ప్రవీణ్, తదితరులు ఉన్నారు.

టపాసుల విక్రయాలకు అనుమతులు తీసుకోవాలి

ముధోల్: టపాసులు విక్రయించడానికి అనుమతులను తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్సై సాయికిరణ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యాపారస్తులు, దుకాణదారులు అనుమతులు లేకుండా బాణసంచా విక్రయించరాదన్నారు. నిబంధనలకు విరుద్ధంగా విక్రయాలు చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విద్యుత్ స్టార్టర్ల చోరీ

కుంటాల: మండల కేంద్రంలోని సీపతి నాగన్న, ఎల్ల గజ్జారాం రైతులకు చెందిన విద్యుత్ స్టార్టర్లను ఆదివారం గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. ఒక్కో స్టార్టర్ విలువ రూ.3,500 వరకు ఉంటుందని రైతులు తెలిపారు. వారం రోజులుగా స్టార్టర్ల చోరీకి పాల్పడుతున్న వారిని గుర్తించి పట్టుకోవాలని రైతులు కోరుతున్నారు.

పాఠశాల ప్రహరీ కమిటీ ఎన్నిక

తానూరు: మండలంలోని ఎల్వి జిల్లా పరిషత్ పాఠశాలలో ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు సోమవారం పాఠశాల ప్రహరీ కమిటీని ఎనుకున్నారు. కమిటీలో ప్రధానోపాధ్యాయులు చైర్మన్‌గా, సీనియర్ ఉపాధ్యాయుడు వైస్‌ప్రెసిడెంట్‌గా, ఇద్దరు విద్యార్థులను మెంబర్లుగా ఉన్నారు. ఎంఈవో నరేందర్, ఉపాధ్యాయులు భూమన్నయాదవ్, సుదర్శన్, శిరీష్ కుమార్, రవీందర్, సూజత దేవి, లక్ష్మి, రజనీకాంత్‌లు పాల్గొన్నారు.

బోరుకు మరమ్మతు

ఖానాపూర్: పట్టణంలోని శాంతినగర్ కాలనీలో గల బోరుకు మున్సిపల్ వైస్‌చైర్మన్ కావలి సంతోష్ సోమవారం మరమ్మతులు చేయించారు. ఒకటో వార్డు పరిధిలోగల శాంతినగర్‌లోని తాగునీటి సమస్య విషయమై తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని మహిళలు వైస్‌చైర్మన్‌కు విన్నవించారు. దీంతో స్పందించిన ఆయన దగ్గరుండి మరమ్మతు పనులు చేయించారు.

ఆలయంలో ఘనంగా అన్నదానం

ఖానాపూర్: పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీలో గల అన్నపూర్ణ మహదేవ ఆలయంలో సోమవారం అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. గత కొద్దిరోజులుగా ప్రతీ సోమవారం నిర్వహించ తలపెట్టిన అన్నదాన కార్యక్రమాన్ని కాలనీకి చెందిన యూత్ ఆధ్వర్యంలో సోమవారం చేపట్టారు. అంతకుముందు ఆలయంలో అర్చకులు కీర్తి రాఘవ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు.

ఆర్థిక సాయం అందజేత

నిర్మల్‌టౌన్: ఇటీవల మున్నూరు కాపు యువజన సంఘ సభ్యుడు సుంకరి రమణ అకాల మరణం చెందగా సంఘం తరఫున రూ.50 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. సోమవారం బాధిత కుటుంబానికి సంఘ సభ్యులు నగదు అందజేశారు.

మాజీ మంత్రి పరామర్శ



పరామర్శిస్తున్న ఇంద్రకరణ్‌రెడ్డి

సారంగాపూర్: మండలంలోని చించోలి(బి) గ్రామానికి చెందిన మాజీ ఉపసర్పంచ్ దుందుల పోశెట్టి అల్లుడు రాజు యాదవ్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా ఆయన కుటుంబాన్ని సోమవారం మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి పరామర్శించారు. నల్ల వెంకట్రామిరెడ్డి, మాణిక్‌రెడ్డి, అహ్మద్ ముక్తార్, పతాని భూమేశ్, శెఫిక్, శంకర్, కాశీనాథ్, రాజలింగం తదితరులు ఉన్నారు.

ఆపదలో అండగా పోలీసులు!

- డయల్ 100తో నేరాలకు అడ్డుకట్ట
- ఐదు నిమిషాల్లోనే ఘటన స్థలాలకు పోలీసులు



అటవీ ప్రాంతంలో తప్పిపోయిన గొర్ల కాపరిని వెతికి పట్టుకున్న పోలీసులు (ఫైల్)

నిర్మల్‌టౌన్: ఎలాంటి ఆపదలో ఉన్నా రక్షణ పొందాలనుకుంటే అందరికి గుర్తొచ్చే నంబర్ డయల్ 100. ఈ నంబర్‌కు కాల్ చేస్తే చాలు 5 –6 నిమిషాల్లోనే పోలీసులు బాధితుల ముందు ప్రత్యక్షమవుతున్నారు. 24/7 సేవలు అందిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారు. అనుకోని ప్రమాదం ఎదురైనా, అర్ధరాత్రి ఆపద వచ్చినా, ఆలుమగలు గొడవపడినా, ఈవ్‌టీజింగ్, వేధింపుల బారిన పడినా ఒక్క ఫోన్‌కాల్‌తో జిల్లా పోలీసులు ఘటనా స్థలంలో వాలిపోతున్నారు. బాధితులను రక్షించేందుకు, శాంతి భద్రతల పరిరక్షణకు నిత్యం కృషి చేస్తున్నారు. లాఠీపట్టి బందోబస్తు బాధ్యతలే కాదు.. ప్రజలకు అండగా నిలుస్తున్నారు.

డయల్ 100పై దృష్టి..

జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన జానకి షర్మిల సమస్యాత్మక జిల్లాగా పేరున్న నిర్మల్‌ను శాంతిభద్రతల్లో ముందుంచారు. శాంతి భద్రతలను అదుపులో ఉంచేందుకు ప్రజలను నిత్యం అప్రమత్తం చేస్తూ.. బాధితులు పోలీస్ సహాయాన్ని సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పిస్తున్నారు. సహాయం కోసం డయల్ 100కు సమాచారం అందించిన బాధితుల వద్దకు పోలీసులు నిమిషాల్లో చేరుకునేలా ప్రత్యేకంగా దృష్టి సారించారు. ఇటీవల డయల్ 100కు సమాచారం ఇచ్చిన కొంత మందిని పోలీసులు ప్రాణాల నుంచి రక్షించారు.

16, 372 ఫిర్యాదులు..

నిర్మల్ జిల్లాలోని 19 మండలాల్లో గల పోలీస్‌స్టేషన్లలో జనవరి 1 నుంచి ఇప్పటివరకు 16,372 మంది డయల్ 100ను సద్వినియోగం చేసుకున్నారు. డయల్ 100 దృష్టికి వచ్చిన ప్రతీ సమస్యను పోలీసులు పరిష్కరించారు.

బాధితులు సహాయం పొందిన సంఘటనలు..

- గత జూలై 24న దస్తురాబాద్ మండలానికి చెందిన గుండా శ్రీనివాస్ అటవీ ప్రాంతంలో గొర్లను మేపడానికి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో రాత్రి 9 గంటల సమయంలో కుటుంబ సభ్యులు డయల్ 100కు ఫోన్ చేశారు. వెంటనే పోలీసులు అక్కడకు చేరుకొని రాత్రి మొత్తం గాలించారు. తెల్లవారుజామున తప్పిపోయిన శ్రీనివాస్ దొరకగా ఆయనను కుటుంబ సభ్యులకు క్షేమంగా అప్పగించారు.
- ఇటీవల హైదరాబాద్ నుంచి నాగపూర్‌కు రాధాకృష్ణ దంపతులు కారులో వెళ్తుండగా సారంగాపూర్ మండలం మహబూబ్ ఘాట్ వద్ద అర్ధరాత్రి సమయంలో కారు అదుపు తప్పి లోయలో పడింది. వెంటనే బాధితులు డయల్ 100కు సమాచారం అందించారు. అప్రమత్తమైన ఎస్సై గోపీనాథ్ సిబ్బందితో కలిసి లోకేషన్ ఆధారంగా అక్కడకు చేరుకొని వారిని సురక్షితంగా బయటకు తీశారు.
- ఇటీవల జిల్లా కేంద్రంలోని విశ్వనాథ్ పేట్ కాలనీకి చెందిన ముజీబ్ కుటుంబ కలహాల వల్ల గడ్డెన్న వాగులో ఆత్మహత్య చేసుకున్నట్లు డయల్ 100కు సమాచారం అందింది. అక్కడకు చేరుకున్న పోలీసులు అతడిని కాపాడి కౌన్సెలింగ్ ఇచ్చి పంపించారు.
- గత సెప్టెంబర్ 27న జిల్లా కేంద్రంలోని బంగల్ పేట్‌కు చెందిన రాధా కుటుంబ కలహాల కారణంగా స్థానిక వినాయక సాగర్ చెరువు వద్ద ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు డయల్ 100కు సమాచారం అందింది. అక్కడకు చేరుకున్న బ్లూ కోర్ట్ సిబ్బంది అనిల్, అజార్ ఖాన్ ఆమె ప్రాణాలు కాపాడారు.

గోప్యంగా వివరాలు..



ఆపత్కాలంలో తమను రక్షించుకునేందుకే కాకుండా నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణకు సామాజిక బాధ్యత వహిస్తూ.. సామాన్య ప్రజలు సైతం డయల్ 100కు సమాచారం అందించవచ్చు. సమాచారం అందించే వ్యక్తుల వివరాలను గోప్యంగా ఉంచుతాం. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా జిల్లాలో డయల్ 100 కాల్స్ పర్యవేక్షణకు ఎస్సై స్థాయి అధికారితో పాటు పది మంది సిబ్బందిని నియమించాం. జిల్లా పెట్రోకార్ పోలీసులు, పెట్రోలింగ్ సిబ్బంది నిమిషాల్లో ఘటన స్థలానికి చేరుకుంటారు.

– జానకీ షర్మిల, ఎస్పీ

ఉపాధిహామీ పనుల ఎంపిక గ్రామసభ



మాట్లాడుతున్న ఈజీఎస్ ఏపీవో గంగాధర్

తానూరు: మండలంలోని జౌలా(కే) గ్రామంలో సోమవారం 2025 –26 సంవత్సరానికి సంబంధించిన ఉపాధిహామీ పనుల ఎంపిక, ప్రణాళికపై గ్రామసభ నిర్వహించారు. 2025 –26 ఆర్థిక సంవత్సరంలో నిర్వహించాల్సిన పనుల ప్రణాళికలను తయారు చేసి గ్రామస్తులకు విన్పించారు. వ్యవసాయ పొలాలకు వెళ్లే రాహదారులు, పూడికతీత పనులు చేపడుతున్నట్లు ఈజీఎస్ ఏపీవో గంగాధర్ తెలిపారు. జాబ్‌కార్డులేని వారు జాబ్‌కార్డుల కోసం దరఖాస్తులు చేసుకుంటే వారికి జాబ్‌కార్డులు అందించి పనులు కల్పిస్తామన్నారు. టీఏ ప్రసాద్, కూలీలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

చాక్‌పల్లిలో ఉపాధిహామీ రెండో గ్రామసభ

నర్సాపూర్(జి): మండలంలోని చాక్‌పల్లి గ్రామ పంచాయతీలో సోమవారం ఉపాధిహామీ రెండవ గ్రామసభ నిర్వహించారు. 2025–26 ఆర్థిక సంవత్సరంలో చేసే పనులు గుర్తింపు, కూలీల బడ్జెట్ అంచనాలను సిద్ధం చేశారు. భూమిని చదును చేయుట, పశువుల పాకలు, ఇంకుడు గుంతలు, చెరువులో పూడికతీత, రైతు పంట చేలకు రోడ్లు వేయడం, హార్టికల్చర్ వంటి పనులకు బడ్జెట్ రూ.1కోటి 20 లక్షలు ఆమోదం కోసం ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపుతున్నట్లు టెక్నికల్ అసిస్టెంట్ సతీశ్ తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నరేశ్ కుమార్, ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటేశ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్ తనిఖీ చేసిన డీఎస్పీ



రికార్డులు పరిశీలిస్తున్న డీఎస్పీ గంగారెడ్డి

దస్తురాబాద్: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను సోమవారం నిర్మల్ డీఎస్పీ గంగారెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసుల వివరాలు, స్టేషన్ రికార్డులు పరిశీలించారు. అంతకుమందు పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. డీఎస్పీ వెంట ఖానాపూర్ సీఐ సైదారావు, ఎస్సై శంకర్, ఏఎస్సైలు లక్ష్మీనారాయణ, శంకర్, పోలీస్‌సిబ్బంది తదితరులు ఉన్నారు.

బ్యాంకింగ్ సేవలపై విద్యార్థులకు అవగాహన



ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు వద్ద విద్యార్థులు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వాణిజ్య విభాగం, కంప్యూటర్ సైన్స్, కంప్యూటర్ అప్లికేషన్ విద్యార్థులు స్థానిక ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకును సోమవారం ఫీల్డ్ ట్రిప్‌లో భాగంగా సందర్శించారు. బ్యాంకింగ్ ప్రక్రియలపై విశ్లేషణ, ఖాతా నిర్వహణ, ఫండ్స్ ట్రాన్స్‌ఫర్, డిజిటల్ బ్యాంకింగ్, సాఫ్ట్‌వేర్, క్రెడిట్‌కార్డ్, ఏటీఎం వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ ప్రణయ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్‌కు డాక్టరేట్

భైంసాటౌన్: పట్టణంలోని మహాత్మా జ్యోతిబాపూలే బీసీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ కోడె నవీన్‌కుమార్ డాక్టరేట్ అందుకున్నారు. 'ఐడెంటిఫికేషన్ ఆఫ్ హార్డ్‌స్పాట్ ఇన్ అండస్టాండింగ్ మేథమెటిక్ కాన్సెప్ట్స్ అమాంగ్ స్టూడెంట్స్ ఎట్ సెకెండరీ లెవెల్ స్కూల్ ఇన్ నిర్మల్ డిస్ట్రిక్' అనే అంశంపై ఆయన చేసిన పరిశోధనకుగాను ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ పట్టా అందించింది. ఈ మేరకు ఆయనను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

ఇసుక టిప్పర్‌ల పట్టివేత

లక్ష్మణచాంద: అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న రెండు ఇసుక టిప్పర్‌లను పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వివరాల్లోకి వెళ్తే.. సోమవారం రాత్రి లక్ష్మణచాంద నుంచి నిర్మల్ వైపునకు అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న టిప్పర్లను మండల కేంద్రం సమీపంలోని పెట్రోల్ బంక్ సమీపంలో ఆర్ఐ నరేందర్ పట్టుకున్నారు. అనంతరం టిప్పర్‌లను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. తహసీల్దార్ జానకిని సంప్రదించగా రాత్రి కావడంతో పోలీస్‌స్టేషన్‌కు తరలించామని మంగళవారం ఉదయం చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మత్తుపదార్థాలకు యువత దూరంగా ఉండాలి

మామడ: యువకులు గుడుంబా, గంజాయి, డ్రగ్స్ వంటి నిషేధిత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని ఎస్సై సందీప్ అన్నారు. సోమవారం మండలంలోని జయరాంతండాలో యువకులకు అవగాహన సమావేశం నిర్వహించారు. డ్రగ్స్ వినియోగంతో శారీరక, మానసిక సమస్యలు ఉత్పన్నమవుతాయని, కుటుంబాలు రోడ్డున పడుతాయన్నారు.

ప్రొసీడింగ్ అందజేత

లోకేశ్వరం: మండలంలోని రాజూర గ్రామంలో గల కురుమ సంఘ భవన నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేయగా ప్రొసీడింగ్‌ను సోమవారం సంఘ భవనంలో మాజీ సర్పంచ్ ముత్తగౌడ్ అందజేశారు. కురుమ సంఘ భవనం నిర్మాణం కోసం రూ.2.50 లక్షల నిధుల ప్రొసీడింగ్‌ను కురుమ సంఘం సభ్యులకు అందజేశారు. నాయకులు సాయిప్రసాద్, నర్సారెడ్డి, రాజేశ్వర్, దేవేందర్, పెంటన్న ఉన్నారు.

దండారీ ఉత్సవాలు ప్రారంభం



ఉత్సవాల్లో పాల్గొన్న ఆదివాసీలు

ఖానాపూర్: మండలంలోని అడవి సారంగాపూర్ పంచాయతీ పరిధిలో గల జిల్లెడుకుంట గ్రామంలో దండారీ ఉత్సవాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఆదివాసీలు సంప్రదాయబద్ధమైన గుస్సాడీ వేషధారణలో ప్రత్యేక పూజలు నిర్వహించి ఉత్సవాలు చేపట్టారు. రోజంతా పాటలు పాడుతూ ఆటలు ఆడారు. ఇతర గ్రామాల నుంచి వచ్చిన ఆదివాసీలతో కలిసి ఉత్సవాల్లో పాల్గొన్నారు. గ్రామపటేల్ మడావి అంకుష్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ డీఏలు చెల్లించాలి

భైంసాటౌన్: ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెండింగ్ బిల్లులు చెల్లించాలని తపస్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో ప్రవీణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. ఉద్యోగ, ఉపాధ్యాయులకు పెండింగ్ డీఏతో పాటు పీఆర్సీ అమలు చేయాలని కోరారు. జిల్లా గౌరవాధ్యక్షుడు రాజేశ్వర్, నాయకులు విఠల్‌రెడ్డి, రాజేశ్వర్, పండరి, తదితరులు పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయించాలి



మున్యాల్‌లో టీకాలు వేస్తున్న సిబ్బంది

దస్తురాబాద్: పశువులకు గాలికుంటు నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలని మండల పశువైద్యాధికారి సంధ్యారాణి సూచించారు. సోమవారం మండలంలోని మున్యాల గ్రామంలో పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతీ పాడిరైతు తమ పశువుల ఆరోగ్యంపై దృష్టి సారించి ఉచిత గాలికుంటు నివారణ టీకాలు వేయించాలన్నారు. మున్యాల గ్రామంలో 260 పశువులకు టీకాలు వేశామన్నారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది దేవాదాస్ ఉన్నారు.

మళ్లీ అల్లరి మూకల అలజడి



ధ్వంసం చేసిన విద్యుత్ పరికరాలు

కుంటాల: కుంటాల ఉన్నత పాఠశాల మందుబాబులకు అడ్డాగా మారింది. ఇటీవల దసరా సెలవు రోజుల్లో పాఠశాలలో మందుబాబులు మద్యం సేవించి, మద్యం సీసాలను వరండాలోనే వదిలేసి వెళ్లారు. విద్యుత్ పరికరాలను ధ్వంసం చేశారు. కాగా తాజాగా ఆదివారం రాత్రి కూడా మద్యం సేవించి మత్తులో పాఠశాల వరండాలోని విద్యుత్ పరికరాలను ధ్వంసం చేశారు. పోలీసులు చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులు, గ్రామస్తులు కోరుతున్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభించిన ఎమ్మెల్యే



కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న మహేశ్వర్‌రెడ్డి

సోన్: మండలంలోని సిద్దులకుంట గ్రామంలో సోమవారం నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి వివిధ అభివృద్ధి పనులు ప్రారంభించారు. రైతు సేవా సహకార సంఘం లిమిటెడ్, నిర్మల్ (ఎఫ్ఎస్‌సీఎస్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సన్న రకం వరి ధాన్యం కొనుగోలు కేందాన్ని ఆయన ప్రారంభించారు. ఖరీఫ్ సన్నకరం వరి ధాన్యానికి ప్రభుత్వం కనీస మద్దతు ధర రూ.2300, బోనస్ రూ.500 చెల్లిస్తుందన్నారు. అనంతరం రూ.80.50 లక్షలతో సిద్దులకుంట లిఫ్ట్ ఇరిగేషన్ పునరుద్ధరణ పథకం పనులకు శంఖుస్థాపన చేశారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు హరీశ్ రెడ్డి పాఠశాల ప్రహరీ నిర్మాణంపై ఎమ్మెల్యేకు వినతి పత్రం ఇచ్చారు. కాలిపోయిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లను అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. అధికారులతో మాట్లాడి రెండు రోజులలో సమస్య పరిష్కరిస్తానన్నారు. ఎఫ్ఎస్‌సీఎస్ చైర్మన్ దర్మాజీ రాజేందర్, గ్రంథాలయ చైర్మన్ అర్జుమంద్ అలీ, బీజేపీ నాయకులు రాంనాథ్, గంగన్న, హరీశ్‌రెడ్డి, మైయిపాల్ రెడ్డి, జక్క రాజేశ్వర్, మార గంగారెడ్డి, డైరెక్టర్లు, వ్యవసాయశాఖ అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

సాక్షి ఎఫెక్ట్..



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే

సారంగాపూర్: మండలంలోని మలక్ చించోలి –జౌళి గ్రామాల మధ్య రోడ్డు అధ్వాన్న స్థితికి చేరడంతో ఈ నెల18న రోడ్డు ఇలా.. ప్రయాణమెలా శీర్షికన సాక్షిలో కథనం ప్రచురితమైంది. స్పందించిన ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి, పంచాయతీ రాజ్ శాఖ అధికారులు రోడ్డు నిర్మాణానికి సోమవారం భూమిపూజ చేశారు. రహదారి నిర్మాణానికి రూ. 2కోట్ల 60లక్షల నిధులు మంజూరు చేయించామన్నారు. నాయకులు ముత్యంరెడ్డి, రాంశంకర్‌రెడ్డి, సాహెబ్‌రావు, నారాయణ, గంగారెడ్డి, తిరుమలచారి, రాజేశ్వర్, డీఈఈ తుక్కారాం, గ్రామస్తులు, తదితరులు ఉన్నారు.

'లైబ్రరీతో విజ్ఞానం పెంపొందుతుంది'



మోడల్ లైబ్రరీలో ఎంఈవో, ఉపాధ్యాయులు

కడెం: లైబ్రరీతో విజ్ఞానం పెంపొందుతుందని ఎంఈవో శేక్ హుస్సేన్ అన్నారు. సోమవారం మండలంలోని లింగాపూర్ గ్రామంలో గల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన మోడల్ లైబ్రరీని ప్రారంభించారు. విద్యార్థులు నిత్యం కొంత సమయం పుస్తకాలు చదవాలన్నారు. హెచ్‌ఎంలు వెంకటరమణ, నర్సయ్య, బి.మహేశ్వర్, శ్రీనివాస్, బ్లాక్ కోఆర్డినేటర్ రాజేందర్, ఉపాధ్యాయులు అఖిల్ అంజూం, రాజమణి, కావ్య ఉన్నారు.

భైంసా: బాసరలో మోడల్ లైబ్రరీని సోమవారం కాంప్లెక్స్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు నర్సయ్య ప్రారంభించారు. యూనైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలమేరకు బాసరలోని ప్రైమరీ పాఠశాలలో లైబ్రరీని ఏర్పాటు చేశారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం బడకల గంగారావు, మండల నోడల్ అధికారి నర్సారెడ్డి, గ్రంథాలయ కోఆర్డినేటర్ మమత, ప్రధానోపాధ్యాయులు తేజస్వీని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నర్సాపూర్(జి): మండల కేంద్రంలోని ఎంపీపీఎస్ పాఠశాలలో మోడల్ లైబ్రరీని సోమవారం ఎంఈవో కిషన్‌రావు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు లైబ్రరీని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రధానోపాధ్యాయుడు వీర్బా పాటిల్, పీఆర్టీయూ మండల అధ్యక్షుడు గంగా చరణ్, కేజీబీవీ ఎస్‌వో వీణ పాల్గొన్నారు.

సారంగాపూర్: మండలంలోని బీరవెల్లి ప్రాథమిక పాఠశాలలో రూమ్ టూ రీడ్ సంస్థ సహకారంతో మోడల్ లైబ్రరీని ఎంఈవో మధుసూదన్ సోమవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో పఠన నైపుణ్యాన్ని పెంచే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. ఎంఎస్‌వో జనార్ధన్, కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు సాయన్న, హెచ్‌ఎం వసుంధర, రూమ్ టూ రీడ్ మండల కోఆర్డినేటర్ రాము తదితరులు ఉన్నారు.

దస్తురాబాద్: ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసమే మోడల్ లైబ్రరీలు ఏర్పాటు చేస్తున్నట్లు ఎంఈవో గంగాధర్ సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో మోడల్ లైబ్రరీని ప్రారంభించారు. ప్రధానోపాధ్యాయుడు కోట వేణు, మండల కోఆర్డినేటర్ రాజేందర్, ఉపాధ్యాయులు కొమురయ్య, రవీందర్, సౌందర్య, బ్రహ్మాచారి, మహేశ్, లావణ్య, వెన్నల, జ్యోతి, సీఆర్పీ, ఐఆర్‌పీలు పాల్గొన్నారు.

టీచర్స్ ఎమ్మెల్సీ ఓటరు నమోదు చేసుకోవాలి



ఓటరు నమోదు చేస్తున్న ఉపాధ్యాయులు

తానూరు: ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మెదక్ నియోజకవర్గ టీచర్స్ ఎమ్మెల్సీ ఓటరు కోసం ప్రభుత్వ ఉపాధ్యాయులు పేర్లు నమోదు చేసుకోవాలని ఎస్టీయూటీఎస్ జిల్లా అధ్యక్షుడు భూమన్నయాదవ్ అన్నారు. సోమవారం మండలంలోని ఎల్వి జిల్లా పరిషత్ పాఠశాలలో ఓటరు నమోదు కార్యక్రమాన్ని భూమన్నయాదవ్ ప్రారంభించారు. అర్హత కలిగి ఉన్న ఉపాధ్యాయులు తప్పనిసరిగా ఓటరు నమోదు చేసుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులు మాదవ్‌రావు, శంకర్, రజనీకాంత్, రవీందర్, లక్ష్మి, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదు వేగవంతం చేయాలి



మాట్లాడుతున్న అంజుకుమార్ రెడ్డి

భైంసాటౌన్: బీజేపీ క్రియాశీలక సభ్యత్వ నమోదు వేగవంతం చేయాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్ రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని ఎస్ఎస్ జిన్నింగ్ ఫ్యాక్టరీలో నిర్వహించిన మండల ఇన్‌చార్జిల సమావేశంలో మాట్లాడారు. వందమంది సభ్యత్వ నమోదు చేసిన వారికి మాత్రమే పార్టీ సంస్థాగతంగా పదవులు లభిస్తాయని, ఎన్నికల్లో పోటీ చేయడానికి సైతం వారికే ప్రాధాన్యత ఉంటుందన్నారు. నవంబర్ 5 వరకు క్రియాశీల, ప్రాథమిక సభ్యత్వ నమోదు చేపట్టి రాష్ట్రంలోనే జిల్లాను అగ్రస్థానంలో నిలపాలన్నారు. జిల్లా క్రియాశీల సభ్యత్వ నమోదు ఇన్‌చార్జి సామ రాజేశ్వర్ రెడ్డి, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు సాగర్, అసెంబ్లీ కోకన్వీనర్ సుమన్, సభ్యత్వ నమోదు జిల్లా కోఆర్డినేటర్ సిరం సుష్మరెడ్డి, భైంసా మాజీ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రాజేశ్‌బాబు, పట్టణ అధ్యక్షుడు మల్లేశ్, మండలాధ్యక్షులు, తదితరులు ఉన్నారు.

మహిళా సాధికారతపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న జ్యోతి

నర్సాపూర్(జి): మండల కేంద్రంలోని 5వ అంగన్వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలు, మహిళలు, కిశోర బాలికలకు మహిళా సాధికారత కేంద్రం జెండర్ స్పెషలిస్టులు జ్యోతి, మౌనికలు సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాల్య వివాహాలు, మహిళా సాధికారత, ఆడపిల్లల చదువు –ప్రాముఖ్యత, చైల్డ్ సర్వీసెస్, సఖి కేంద్రం సేవలు, మహిళల హెల్ప్‌లైన్ నంబర్లు, లైంగిక వేధింపులపై అవగాహన కల్పించారు. అంగన్వాడీ టీచర్లు గంగామణి, అరుణ పాల్గొన్నారు.